క్లుప్తంగా

వేల్పూరు నివాసి నేత్ర దానం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామవాసి ఓబూరి రామాంజనేయులు (55) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో రెండు నేత్రాలను శంకర కంటి వైద్యశాలకు దానం చేసినట్లు అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. అవయవ దానం వల్ల మరొకరికి ప్రాణం పోసినట్లు అవుతుందని పేర్కొన్నారు. చనిపోయిన వారంతా ఐదు గంటల సమయంలోపు నేత్రాలు దానం చేయటానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఓబూరి మల్లికార్జునరావు, ఆదినారాయణ, నాగరత్నమ్మ, మంగమ్మ, నాగేశ్వరరావు, నాగజ్యోతి, అశోక్ చౌదరి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



చిలకలూరిపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి జెడ్పీ హైస్కూలులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా మెలగాలని సూచించారు. అనారోగ్యం కలిగిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ సీహెచ్. రామకృష్ణ, డాక్టర్ ప్రత్తిపాటి ప్రఫుల్లాదేవి, డాక్టర్ మైధిలీరాణి, డాక్టర్ అనితలు 200 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒయాసిస్ సంస్థ సభ్యులు ఎండీ కరిమా, కరణం విజయలక్ష్మి, పి. సంధ్యారాణి, కందిమళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నాదెండ్ల, చిరుమామిళ్ల, జంగాలపల్లె, సంకురాత్రిపాడు గ్రామాల్లో సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామస్తులంతా సహకరించాలని వారు కోరారు.

చిరుమామిళ్ల విద్యార్థినికి నవోదయ సీటు



నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్లలో గల కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసిన కనిగిరి లలిత జవహర్ నవోదయ విద్యాలయలో సీటు సాధించింది. ఈ మేరకు పాఠశాలకు ఉత్తర్వులు అందాయి. 1-5వ తరగతి వరకూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థిని లలిత కోచింగ్ లేకుండానే నవోదయ సీటు సాధించడంపై ఉపాధ్యాయులు కాట్రు శ్రీనివాసరావు అభినందించారు. లలిత తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు. గ్రామంలో చిన్న హోటల్ నడుపుతూ పిల్లలను చదివించుకుంటున్నారు.

వ్యక్తిపై దాడి

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం ఎస్సీ కాలనీలో వ్యక్తి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన సాగర్‌పై అదే కాలనీ చెందిన జార్జితో పాటు మరో ఇద్దరు ఇనుప రాడ్డుతో దాడి చేశారు. ఘటనలో సాగర్‌కు తల నుదుటి భాగం, ముఖంపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాలమహానాడు అధ్యక్షుడిగా రాయప్ప



విజయపురి సౌత్: మాలమహానాడు మాచర్ల మండలం విజయపురిసౌత్ అధ్యక్షుడిగా కట్ట రాయప్పను నియామకం చేసినట్లు నియోజకవర్గ మాల మహానాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతమళ్ళ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఫిల్టర్ హౌస్ ఏరియాలో పలువురు మాల సంఘం పెద్దల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి కట్టా రాయప్పను అధ్యక్షునిగా, ఉపాధ్యక్షునిగా చింతమళ్ల చెన్నకేశవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం నాయకులు పగిడిపల్లి విజయ్, తాడిమల్ల రాహుల్, రుద్రపాటి ధనుంజయ్, పత్తి రామచందర్, బుట్టి అక్కయ్య, జక్కి ప్రేమ్ కుమార్, చింతమళ్ల యాకోబు, బండి వెంకటేశ్వర్లు, గొర్రె ముచ్చు ఆంజనేయులు, దార్ల రంజిత్ కుమార్, అందే రాంబాబు, కొండ కోటయ్య, మద్దు ముక్కంటి, పత్తి ఢిల్లీ, దాసరి కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

వాహనం.. ఆదమరిస్తే మాయం !

- పల్నాడు జిల్లాలో నిత్యం ద్విచక్ర వాహన చోరీలు
- పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు
- నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్న యజమానులు



బండికి హ్యాండిల్ లాక్ వేశాం.. ఒకటికి రెండుసార్లు మరీ చెక్ చేసుకున్నాం. హమ్మయ్యా..ఇక సేఫ్ అనుకుంటూ హోటల్లోకి వెళ్లి టిఫిన్ చేసి బయటకు వచ్చాం.. చేతిలో తాళం చేతిలోనే ఉంది.. బండి మాత్రం మాయమైంది. ఇది పల్నాడు జిల్లాలో నిత్యం బైక్ దొంగతనాల జోరు.

నరసరావుపేట టౌన్ : పల్నాడు జిల్లాలో ద్విచక్ర వాహనదారుల దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని చెలరేగిపోతున్నారు. ఇంటి ముందు, గేటు బయట, రోడ్డుపక్కన నిలిపిన వాహనాలకు భద్రత కరువవుతోంది. నిమిషాల వ్యవధిలో కనిపించకుండా పోతున్నాయి. జాగ్రత్తలు తీసుకున్నా దొంగలు హస్త లాఘవం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇంటి ఎదుట నిలిపిన బైకులే ఎక్కువగా మాయమవుతున్నాయి. ఇటీవల జరిగిన పలు ఘటనలు వాహన యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. సమీపంలోని సీసీ కెమెరాలో పరిశీలించగా అగంతకులు బైక్ తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కానీ నిందితుడిని గుర్తించి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు వందల సంఖ్యలో వాహనాలు అపహరణకు గురయ్యాయి. కొన్ని స్టేషన్లలో అధికారులు ద్విచక్ర వాహన చోరీకి సంబంధించి కేసులే నమోదు చేయడం లేదు. దీంతో బాధితులు ప్రతి సోమవారం నిర్వహించే స్పందనకు వచ్చి తమ గోడును అధికారులకు వెళ్లబోసుకుంటున్నారు.



ఇటీవల చిలకలూరిపేటలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

సవాల్‌గా మారిన దొంగతనాలు

పట్టణంలోని రహదారులు, కాలనీలు, అపార్ట్‌మెంట్ల చుట్టూ సీసీ కెమెరాలు లేకపోవడం కూడా దొంగతనాలకు కారణంగా ఉంది. గస్తీ పోలీసులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, చోరీల రేటు తగ్గకపోవడం గమనార్హం. దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలను నంబర్ ప్లేటు మార్చి చోరులు విక్రయిస్తున్నారు. నరసరావుపేటకు చెందిన ఓ ముఠా చిలకలూరిపేట, వినుకొండ తదితర ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన బైక్ చోరీల్లో నరసరావుపేటకు చెందిన కొందరు యువకులు అనుమానితులుగా ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నాదెండ్ల మండల సాతులూరులో రెండు నెలల వ్యవధిలో ఏడు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురి కావడం గమనార్హం. అక్కడ బ్యాంకులోకి వెళ్లి పని చూసుకొని బయటకు వచ్చేలోగా వాహనం మాయం కావడం చోరీల తీవ్రతను తెలుపుతోంది.

పెండింగ్‌లో అనేక కేసులు

గత పది నెలల్లో పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ పట్టణాల్లో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహన దొంగతనాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఇక వాహనం చోరీ జరిగినప్పటికీ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయని వారు అనేక మంది ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసై కొంతమంది యువత ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నరసరావుపేట పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎ 30కి పైగా ద్విచక్ర వాహన చోరీ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే కొన్ని కేసుల్లో రికవరీ చేసి యజమానులకు వాహనాలు అప్పగించగా, మరి కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. సీసీ పుటేజ్‌లో నిందితుడి ఆనవాళ్లు స్పష్టంగా కనపడక పోవడం పోలీసులకు సమస్యగా మారింది. చోరీ జరిగిన ప్రాంతాల్లో ఎటువంటి క్లూ లభ్యం కాకపోవడంతో కేసుల్లో పురోగతి లభించడం లేదని పోలీసులు చెబుతున్నారు.

నివారణకు చర్యలు



డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహన దొంగతనాలకు సంబంధించి 80 శాతం కేసుల్లో నిందితుల్ని అరెస్ట్ చేశాం. వాహనాలను రికవరీ చేసి యజమానులకు అప్పగించాం. పార్క్ చేసే సమయంలోనే యజమానులు అప్రమత్తంగా ఉండాలి. సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నచోట్ల నిలుపుకుంటే మంచిది.

– కె.నాగేశ్వరరావు, డీఎస్పీ



వృక్ష విలాపానికి కారణం ఎవరు ?

- ఎన్‌జీఓ కాలనీలో చెట్లు నరికివేత
- వర్షాలకు పడిన కొమ్మలనే నరికించామంటున్న అధికారులు
- పూర్తిస్థాయిలో చెట్లు తొలగించడంపై ప్రజల నుంచి విమర్శలు



కాలనీలో నరికిన చెట్లు

నరసరావుపేట: ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటి పచ్చదనం కాపాడాలని సూచిస్తుంటే.. నరికి సొమ్ముచేసుకుంటున్న వైనం పట్టణంలో జరుగుతోంది. ఇటీవల ఎన్‌జీఓ కాలనీలో మెయిన్ రోడ్డు, వాటర్ ట్యాంకు సమీపంలో మధ్యలో ఐదారు చెట్లు, వాటి కొమ్మలను నరికి కుప్పలుగా పెట్టడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ తీగెలు కింద ఉన్న చెట్లతో పాటు లేని ప్రదేశంలో కూడా చెట్లు నరికి వేయడం శోచనీయం. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణానికి ఎన్‌జీఓ కాలనీ పేరుగాంచింది. చెట్లు నరికి బోడిగుండులా చేయటంతో స్థానికులు మనోవేదన చెందుతున్నారు. కొత్తగా పుట్టుకొచ్చిన నాయకులు వ్యవహార శైలి మేరకే ఈ చెట్లు నరికివేత జరిగిందని స్థానికులు విమర్శిస్తున్నారు. స్కూలు పిల్లలకు మొక్కలు అప్పచెప్పి వారితో పెంచే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుంటే.. ఉన్న చెట్లను నరికి పచ్చదనం దూరం చేయటమేమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, డెప్యూటీ ఇంజనీరు షేక్ మహమద్ రఫీ వివరణ ఇస్తూ ఇటీవల కురిసిన వర్షాలకు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగెలపై పడుతుండటంతో తామే వాటిని తొలగించినట్లు తెలిపారు. కాలనీకి చెందిన మరికొందరు కార్లపై చెట్ల కొమ్మలు విరిగిపడుతున్నాయని కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తొలగించిన చెట్ల కొమ్మల దుంగలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి, ఆ సొమ్ము పురపాలక సంఘానికి జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు



నరసరావుపేట: దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి(ఎంఆర్‌పీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ వైద్యశాలకు ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గీయులు కలిసి ఐక్యమత్యంతో రాజ్యాధికారం వైపు పయనించాలని కోరారు. కార్యక్రమంలో కూచిపూడి రమేష్ మాదిగ, ఈపూరు, నరసరావుపేట మండల నాయకులు ముప్పాళ్ల గురవయ్య మాదిగ, బండారు సుధాకర మాదిగ, నాయకుడు కూచిపూడి రమేష్, ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మేడ పోతురాజు పాల్గొన్నారు.

సీతమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పణ



నాదెండ్ల: తొలి ఏకాదశిని పురస్కరించుకుని గణపవరం కోదండ రామాలయంలో కొలువై ఉన్న సీతమ్మ తల్లికి భక్తులు ఆషాఢ మాస సారె సమర్పించారు. తొలుత అమ్మవారి ప్రతిమతో పాటు సారె, పసుపు కుంకుములు, గాజులతో ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారులు దర్శి అనిల్‌కుమార్‌శర్మ, ఉమామహేశ్వరశర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దేశమ్మ తల్లి... దయ చూపించమ్మా

గ్రామ దేవతకు పొంగళ్లు పొంగించి, వారు పోసిన గ్రామస్తులు



ప్రత్యేక అలంకరణలో దేశమ్మ తల్లి



అమ్మవారి పొంగళ్లు పొంగిస్తున్న గ్రామ పెద కాపు, పెద్దలు

పెదకూరపాడు: గ్రామ దేవత దేశమ్మ తల్లిని సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా దయచూపించమ్మా అంటూ మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామ ప్రజలు ఆదివారం వేడుకున్నారు. ఆషాఢ ఆదివారం పురస్కరించుకుని గ్రామంలోని చిన్నారులు, యువకులు పెద్దలు అమ్మవారికి వారు పోశారు. అనంతరం గ్రామ పెద కాపు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు దేశమ్మ తల్లికి తొలి పొంగళ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం గ్రామంలోని మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మేళతాళాలతో, బాజా భజంత్రీలతో ప్రభను కట్టి గ్రామ పుర వీధులలో ఊరేగించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

'సంఘ స్వరం' ఆధ్యాత్మిక మాస పత్రిక ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో 'సంఘ స్వరం' అనే సంఘ సమాచార, ఆధ్యాత్మిక మాస పత్రికను దైవజనులు రెవ. జరుగుమల్లి ఇశ్రాయేలు ఆదివారం చర్చి ఆవరణలో ఆవిష్కరించారు. ప్రతి నెలా విడుదల కానున్న ఈ పత్రికను క్రమం తప్పక సంఘస్తులు చదవాలన్నారు. క్రియారూపక విశ్వాసంలో మరింత స్థిరపడడానికి దోహదం చేస్తుందన్నారు. బాప్టిస్టు సంఘాల గురించి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం సంఘ సభ్యుడు, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గర్నెపూడి సాల్మన్‌రాజును కార్యవర్గం సత్కరించింది.

గురుభక్తికి నిదర్శనం ఏకలవ్యుడు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: గురుభక్తికి నిదర్శనం ఏకలవ్యుడని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దృఢ సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించవచ్చని మహాభారతంలో ఏకలవ్యుడి పాత్ర నిరూపిస్తుందని తెలిపారు. విలువిద్య నేర్పించేందుకు గురువు తిరస్కరించినా పట్టుదలతో సాధించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు బి. శ్రీనునాయక్, నాయకులు పాలపర్తి బాబు, శ్రీనివాసరావు, చిన్నా నాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం పెద్ద షరిగెత్తు



కొండవీడు పీర్ల చావిడి వద్ద సిద్ధం చేస్తున్న అగ్నిగుండం



విప్పర్లలో కనువిందు చేసిన వేషధారణలు



రొంపిచర్లలో ఊరేగుతున్న పీర్లు

యడ్లపాడు: కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానికులు, బంధుమిత్రులు మూడు రోజుల ముందుగానే తరలి రావడంతో కొండవీడులో సందడి నెలకొంది. మొహర్రం పండుగను జిల్లాలోనే అత్యంత వేడుకగా నిర్వహించడం, తిలకించేందుకు భారీగా ప్రజలు రావడం విశేషం. 11 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం చివరి ఘట్టానికి చేరుకుంది. ఆదివారం పదో రోజును పురస్కరించుకుని పెద షరిగెత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా యడ్లపాడు, కారుచోల, తిమ్మాపురం, బోయపాలెం, కోట, కొండవీడు గ్రామాల్లోని పీర్ల చావిళ్లలో పంజాలను పుష్పాలు, బాసికాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చావిళ్లకు కులమతాలకు అతీతంగా భక్తులు వచ్చి పంజాలకు పూల బాసికలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద షరిగెత్తు సందర్భంగా ఆదివారం సాయంత్రం గ్రామంలో పీర్లను ముజావర్లు ఊరేగించారు. పండుగ సందర్భంగా ముస్లింలు పవిత్ర రోజా ఉపవాసాలను చేపట్టారు. కార్యక్రమానికి హాజరయ్యే వేలాది మందికి గ్రామస్తులు భారీగా అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

రొంపిచర్ల : మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, సంతగుడిపాడు, మునుమాక, ఎడ్వర్డ్‌పేట తదితర గ్రామాల్లో ఆదివారం పీర్ల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. 10వ సరగత్ పురస్కరించుకుని రొంపిచర్లలోని మూడు చావిడిల్లో పీర్లను కనక తప్పెట్లు, సన్నాయి మేళాలతో ఊరేగించారు. పీర్లను ఎత్తుకుని యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విప్పర్లలో 10వ సరగత్ పురస్కరించుకుని గ్రామానికి చెందిన వల్లంశెట్టి నాగేశ్వరరావు వేసిన వేటగాడు, తుమ్మల ఖాదర్ బాషా వేసిన పెద్ద పులి వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పలు విన్యాసాలు చేస్తూ గ్రామస్తులను కనువిందు చేశారు. విప్పర్ల పీర్ల చావిడిలో షేక్ చింతపల్లి హుస్సేన్ ముజావర్ పర్యవేక్షణలో ఉత్సవాన్ని నిర్వహించారు.

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చిలకలూరిపేటలో టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

చిలకలూరిపేట: పెంపుడు జంతువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాసరావు సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లను స్థానిక పశువైద్యశాలలో ఆదివారం ఉచితంగా వేశారు.శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు ప్రారంభించారు. శిబిరంలో 120 పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యులు దీప్తి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

స్థానిక పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండలంలోని వేల్పూరు, కారుమంచి గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో కూడా పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శావల్యాపురం పశు వైద్యాధికారి జెర్మి కావ్య, సిబ్బంది బుల్లెయ్య, అబ్రహాం, అజయ్, బాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఉన్నతికి పాటుపడతా !



అమ్మిరెడ్డి అంజిరెడ్డిని సన్మానిస్తున్న మండల నాయకులు

నూజెండ్ల: వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం రావాలంటే నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని అమ్మిరెడ్డి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఆయన్ను నూజెండ్ల మండల నాయకులు ఆదివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఉన్నతికి పాటుపడతానని తెలిపారు. తనపై నమ్మకముంచి క్రియాశీలక పదవి అప్పగించిన అధిష్టానానికి, మాజీ శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. కష్టకాలంలో ఉన్నప్పుడు మనమంతా పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు నేతృత్వంలో ఐకమత్యంతో ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నేతలు వంగూరి ప్రసాద్, జక్కిరెడ్డి పెద్దబ్బాయి, గోవిందరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, వీరాంజనేయరెడ్డి, ఫణిదెపు వెంకట్రావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బోనం వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట: రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షుడిగా బోనం వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా దోరడ్ల మనోజ్‌కుమార్, కోశాధికారిగా జంపని శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో రోటరీ మాజీ గవర్నర్ అన్నె రత్నప్రభాకర్, తాళ్ల రాజశేఖరరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి రాఘవయ్య, లంకా ఆదినారాయణరెడ్డి, లంకా రఘురామిరెడ్డి, అలంగార్ మోహన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



నాదెండ్ల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో అన్ని శైవ క్షేత్రాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. నాదెండ్ల, గణపవరం, చందవరం, సాతులూరు, సంకురాత్రిపాడు, కనపర్రు, తూబాడు, గొరిజవోలు, అప్పాపురం గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. నూతన దంపతులు త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. చిరుమామిళ్లలోని శ్రీ కోటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, విశిష్ట అభిషేకాలు జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.